# కులవృత్తి

ప్రధాన పూజారి దేవాలయం ముఖద్వారం ముందు, పట్టుపంచతో, పంగనామాలతో, అలౌకిక తేజస్సుతో, నిరీక్షణా నేత్రాలతో, చందన చర్చిత సువర్ణ శరీరంతో, నిలబడి ఉన్నాడు. సాధారణంగా స్వామి అంతసేపు అక్కడ ఆ విధంగా నిలబడి ఉండడు. ఎవరో వివిఐపి వస్తున్నట్లు సమాచారం వచ్చి ఉండాలి.

ఉంగరాల జుట్టు అందంగా దువ్వుకొని, టక్ చేసుకొని, బూటు వేసుకొని, సొగసైన మీసాల రంగులో కాంతులీనుతున్న ముఖ వర్చస్సుతో ఉన్న మూర్తి గుడిలోకి ప్రవేశింపబోయాడు.

స్వామి అటకాయించి 'ఆగు! ఎవరు నువ్వు?' అన్నాడు.

'భక్తుణ్ణి!' అన్నాడు మూర్తి.

'బూటుతో గుళ్ళోకి పోతావా?'

'పోతాను!'

'పోరాదు!'

'ఎవరు చెప్పారు?'

'నేనే!'

'నువ్వెవరివి చెప్పటానికి?'

'గుడి ప్రధాన పూజారిని'

'నీకెవరు చెప్పారు?'

'ధర్మం!'

'ఎక్కడ రాసి ఉంది?'

'నేను చెబుతున్నాను!'

'నువ్వు చెబితే వేదవాక్కా? రూలా?'

'ఆఁ! రెండూనూ. చెప్పులతో లోనికి పోరాదు'

'చెప్పులు కాదు, బూట్లు'

'విప్పాల్సిందే!'

'బూట్లతో రారాదని దేవుడు ఆదేశించాడా'!

'నేను ఆదేశించాను. అది సంప్రదాయం. అది మన సంస్కృతి'

'భక్తుడికి-భగవంతుడికి మధ్య నువ్వు ఎందుకడ్డం?'

'పూజారి లేనిదే, పూజలేదు. భక్తుడు లేడు, భగవంతుడు ప్రసన్నుడుకాదు.'

గుడిలోకి వెళ్లే భక్తులు వెళుతున్నారు. వచ్చేవాళ్ళు వస్తున్నారు. పెద్దగా రద్దీ లేదు. వేసవి ఎండ మండుతూ ఉంది. మధ్యాహ్నం కావస్తూ ఉంది.

అది ప్రాచీన దేవాలయం. చాలా కాలం అక్కడ పూజా పునస్కారాలు ఏమీలేవు. ఈ మధ్య ఆ అడవి మధ్య నుంచి బైపాసు రోడ్డు పడింది. నేషనల్ హైవేని కలుపుతూ ఉంది. ఆ విధంగా గుడికి ప్రాధాన్యం వచ్చింది. దేవాదాయ శాఖ గుర్తించింది. పూజారి వర్గాన్ని నియమించింది. భక్తుల రాకపోకలు పెరిగాయి. హోటళ్ళు, అంగళ్ళు, లాడ్జిలు ఏర్పడ్డాయి. దూరపు ప్రయాణికులు ఆగి బడలిక తీరి, కాలకృత్యాలు తీర్చుకొని, భోజనాదికాలు ముగించుకొని, దేవుణ్ణి దర్శించుకొని, మరీ ప్రయాణమై వెళిపోసాగారు. స్వామి మాహాత్మ్యం బాగా ప్రచారమయింది. పదిమందీ చెప్పుకోసాగారు. దేవాలయ దర్శనానికే జనం రాసాగారు. అడవి కావటంతో ప్రకృతి రామణీయకత భక్తులకు ఆహ్లాదకరంగా ఉంది. ఎండాకాలం చెట్లకింద జనం గుంపులు గుంపులుగా విశ్రాంతి తీసుకొంటూ ఉంటారు.

మీ చెప్పులకు మీరే బాధ్యులనీ, దొంగలున్నారు జాగ్రత్త అనీ రెండు బోర్డులున్నాయి.

'బూట్లు వదిలిపోతే ఉంటాయా?' మూర్తి అడిగాడు.

స్వామి మాట్లాడలేదు. బోర్డులవైపు చూశాడు. చదువుకోమన్నట్లు ఉంది సూచన.

అక్కడ చెప్పులు మాయమవుతాయని ఒక జానపద గాథ ప్రచారంలో ఉంది. అరణ్య వాసానికి చెప్పులతో వచ్చిన రాముడు, భరతుడు పాదుకలు తీసుకొనిపోగా, పాదరక్షలు లేనివాడయ్యాడు. అప్పటి నుంచి చెప్పులతో వచ్చినవాళ్ళు, చెప్పులు పోగొట్టుకోకుండా పోరు. లేకుండా వచ్చినవాళ్ళు నిర్భయంగా పోగలరు.

చెప్పుల్లేకుండా రాకపోకలు సాగితే, ఏ పరమభక్తుడైనా, ఏ సంపన్న భక్తుడయినా, బైపాసు రోడ్డునుంచి రాళ్లు ముళ్ళు లేని రోడ్డు వేయించే అవకాశం ఉంది.

భక్తులు సాధారణంగా ఏవో వాహనాలలోనే వస్తారు. వాళ్లు వాటిలోనే చెప్పులు విడిచివస్తారు. లేదా లాడ్జిలో వదిలివస్తారు. మూర్తికి ఈ పరిస్థితి అంతుబట్టినట్లు లేదు.

'నా బూట్లు కాపాడే వాళ్ళుంటే కొంత డబ్బిస్తాను!'

స్వామి మాట్లాడలేదు.

'ఎవరినైనా ఏర్పాటు చేసి ఉండకూడదా?'

'ఆ అవసరం రాదు!'

'నా బూట్లు ఖరీదు మూడువేలు. దాటిని పోగొట్టుకోలేను.'

'అవి లేకుండా రావలసింది!'

'బూట్లు లేకుండా నడవలేను!'

ఎండలు మండుతూ ఉండటంతో భక్తుల రాకపోకలు తగ్గాయి.

'ఎవరూ ఉన్నట్లు లేరు. పోయి మొక్కి వస్తాను'

'బూటుతో పోరాదు'

'బూటు లేకుండా నడవలేను!'

'మానేయండి!'

'దైవదర్శనం చేసుకొని తీరాలి!'

'బూటు లేకుండా నిరభ్యంతరంగా చేసుకోవచ్చు'

టూరిష్టు బస్సు వచ్చింది. భక్తులు ఆదరాబాదరా పరుగెత్తుకు వచ్చారు. వాళ్ళు లోనికి పోగానే 'నా బూట్లు బాగున్నాయి. మురికిలేదు. శుభ్రంగా ఉన్నాయి. పాలీషు చేసి ఉన్నాయి. నేను స్నానం చేసివచ్చాను. ఆ యాత్రికులు లాగా చెమట కంపుతో అశుభ్రంగా లేను. పోయి దర్శనం ముగించుకొని వస్తాను'.

'బూట్లు తీసి హాయిగా వెళ్ళిరండి. యాత్రికులు చెప్పులతో రాలేదు.'

స్వామి ఎండ భరించలేకుండా ఉన్నాడు. చొక్కాలేదు. పైపంచె లేదు. చెమట పట్టింది. చుక్కలు చుక్కలుగా చెమట, ముఖద్వారం మీద, కదలినప్పుడు, పడుతూ ఉంది. లేకపోతే కట్టుపంచె చెమట పీలుస్తూ ఉంది. మీగాళ్ళ కింద పుట్టిన చెమట తాను నడచినంత మేర భూమిని ఆలింగనం చేసుకొంటూ ఉంది. స్వామి లోనకూ బైటకూ తిరుగుతున్నాడు. చెమటకు, చెమట కాయలకు వీపుదురద పెడుతంటే జంధ్యంతో గీక్కోవటంవల్ల, అది మురికై నల్లగా మారింది.

'నేను మురికిగా లేను!'

'సంతోషం!'

"నువ్వు, మురికిగా ఉన్నావు!"

'నేనా?'

'అవును. నీ జంధ్యం మురికి, నీ కట్టుపంచె మురికి, నీ శరీరం మురికి.'

'తప్పదు!'

'నాకు బూటు తప్పదు.'

'నాకు బూట్లు చెప్పులు లేవు.'

'నాకు మురికి పంచె, మురికి జంధ్యం లేవు కాబట్టి మురికిలేని బూటుతో నేను లోనికి పోవచ్చు!'

'పోరాదు. ధోవతి మానరక్షణ!'

'బూటు పాదరక్షణ!'

'బూటు నిషిద్ధం!'

'దేవుడిచ్చిన శరీరం తప్ప అన్నీ నిషేధించవచ్చుగదా!'

'ఇక్కడా నిషేధం లేదు.'

'చెమట నెందుకు నిషేధించలేదు.'

'చెమట శరీరంలో భాగం!'

'చెప్పులు పాదాలకు అవసరం. నీ తల కంపుకొడుతూ ఉంది. నీ బట్టలు కంపు కొడుతూ ఉన్నాయి.'

'కంపులేదు!'

'చెమట కంపు కొడుతున్నాయి.'

'అది అనివార్యం.'

'నేను స్నానంచేసి వచ్చాను. ఇస్త్రీ బట్టలు వేసుకున్నాను. నాకు ఇంకా చెమట పట్టలేదు. నా పాదాల రక్షలు పరిశుభ్రంగా ఉన్నాయి. నాకు దైవదర్శనం నిషిద్ధమా? న్యాయంగా ఉందా?'

'న్యాయమే! దేవుడికి మురికి అంటరాదు.'

'నీకంటే మురికిగా–'

'నేను పూజారిని.'

'పూజారి మురికి శరీరంతో దేవాలయంలో ప్రవేశింపవచ్చు కానీ, పరిశుభ్రంగా ఉన్న బూటు ప్రవేశం నిషిద్ధమా!

'అవును.'

'అపరిశుభ్రమైన అంతరంగం నిషిద్ధం కాదుగదా!'

'ఎలా తెలుస్తుంది?'

'హంతకుడి అంతరంగం పరిశుభ్రంగా ఉంటుందా?'

'ఉండకపోవచ్చు'

'హంతకుడు ఆలయంలోకి రావచ్చా!'

'నిషేధం లేదు'

'హంతకులు, దొంగలు, కుట్రదార్లు, మోసగాళ్ళు, వ్యభిచారులు, జూదరులు, తాగుబోతులు, కపటులు, కల్మషులు, కుళ్ళుబోతులు, ద్రోహులు, దోషులు, అపచారులు, అధర్ములు, అక్రములు, అన్యాయస్థులు, రావచ్చు. దర్శనం చేసుకోవచ్చు కానీ, ఏమచ్చాలేని మనిషి బూటు వేసుకొని మాత్రం రారాదు. అంతేనా?'

'అంతే! చెడ్డవాళ్ళు మంచివాళ్ళుగా మారటానికి దేవుడు అవసరమేకదా!'

'చెడ్డవాళ్ళు చెడ్డపనులు మరింత అధికంగా చేయటానికి రావచ్చుకదా?'

'ఏం చేస్తాం? రావచ్చు'

'చెడ్డవాళ్ళు రావచ్చు. కాని చెప్పులు వేసుకొన్నంత మాత్రాన మంచివాడు రాకూడదు. అంతేనా?'

'నీది వితండవాదం!'

'అంతరంగ మాలిన్యం అవరోధం కాలేదు'

'అది అగోచరం. నిరోధించలేం?'

'దృగ్గోచరమయ్యే బూటు మాలిన్యంకాదే?'

'బూటు పరిశుభ్రంగా ఉన్నా, అది పరిహార్యం.'

'ఎందుకు?'

'అది అహంకారానికి గుర్తు!'

స్వామికి మూర్తితో మాట్లాడటం ఎందుకో, కారణం తెలియదు, ఇష్టంగా ఉంది.

భక్తుల రాకపోకలు దాదాపు తగ్గిపోయాయి. స్వామి నిరీక్షిస్తున్న వివిఐపి ఇంకా రానందువల్లే మెట్లదగ్గర పడిగాపులు పడుతూ ఉన్నట్లున్నాడు. పూజారి కార్యదీక్ష గౌరవార్హంగా ఉంది.

'బూటు అహంకారమైతే, టోపీ కాదా, పూలమాల కాదా, సెంటు కాదా, తల్లో ఊలుకాదా, ఆభరణాలు కావా? అలంకారాలు కావా? వేళ్ళనిండా ఉంగరాలు, మెడనిండా దండలు రకరకాల వికారాలు అహంకారంకాదా?'

'దైవదర్శనం అహంకారం చంపుకోవటానికే!'

'మలిన మనస్సు, మలిన దేహం, మలిన అహంకారం లేకుండా మనిషి ఉన్నాడా? నిరహంకారంతో మనిషి మసలుతున్నాడా? నా దేవుడు, నా పూజ, నా సేవ, నాభక్తి, నా అతిశయం, నా పవిత్రత, నా ప్రాధాన్యం. అసలు ఇవన్నీ కలిగించే భక్తి, దానంతట అదే భక్తి అహంకారం కాదా?'

స్వామి మూర్తి ముఖంలోకి ప్రేమగా చూశాడు. భక్తుణ్ణి భగవంతుడు అనుగ్రహించి నట్లు చూశాడు. పూజారికి మూర్తి ఇష్టమయినట్లుగా ఉందనిపించే చూపు చూశాడు.

'కోరిక అహంకారం కాదా? అసలు దర్శనమే అహంకారం కాదా? భక్తులందరూ నిరహంకారులేనా? బూటు వేసుకొని దర్శనం చేసుకోవటమే అహంకారమా? అహంకారి చెప్పులు తీయగానే నిరహంకారి అవుతాడా?'

'అది ఆచారం. ఆచారం శాసనంకంటే శ్రేష్ఠం. దాన్ని ప్రశ్నించరాదు. అందుకు సమాధానం ఉండదు. బూటు తీస్తే దేవాలయ ప్రవేశం లేకపోతే-'

'తిరస్కారం. అంతేనా?'

'బహిష్కారం కూడా-దేవాలయ బహిష్కారం'

'దేశ బహిష్కారం కాదుగదా!'

'తిరస్కారమే బహిష్కారం'

'ఇది మీకు ధర్మంగా కనిపిస్తుందా? నిర్మమకారంతో ఆలోచించి చూస్తే.'

'ధర్మమే! అది సదాచారం. సదా ఆచారం. ఆచారం సత్సంప్రదాయం. సత్సంప్రదాయ బాహ్యుడు- అంతే దేవాలయ బాహ్యుడు.'

'నీతి బాహ్యుడు, ధర్మబాహ్యుడు. ఆచార బాహ్యుడు, నియమ బాహ్యుడు, నీతిబాహ్యుడు. మానవతా బాహ్యుడు, పవిత్రతా బాహ్యుడు, పరిశుద్ధతా బాహ్యుడు, దేవాలయ బాహ్యుడు కాడు కానీ-'

'భక్తమహాశయా - బూటుకాళ్ళ వాడు దేవాలయ బాహ్యుడు!'

బిళ్ళా బంట్రోతులు వచ్చారు. వెంట క్లర్కులు వేంచేశారు. వెనక ఆఫీసర్లు వచ్చారు. వాళ్ళ వెనక మెడ నిగడదోలి పెద్దాఫీసరు వచ్చాడు. స్వామి తప్పుకొన్నాడు. వాళ్ళు గుళ్లోకి పోయారు. వాళ్ళతో కలిసి మూర్తి లోనికి వెళ్ళాడేమోనని సందేహించి, స్వామి అటూ ఇటూ చూడసాగాడు.

అప్పుడొకరు ఇప్పుడొకరు భక్తులు వస్తూపోతూ ఉన్నారు. పొద్దు వాలుతూ ఉంది.

మూర్తి లోనికి పోయినట్లున్నాడని స్వామి అనుకొన్నాడు. బూటుతో దర్శనం చేసుకొంటే

ఎంత ఘోరం! గుడిలోనో, గర్భగుడిలోనో ఎవరైనా చూస్తే అతణ్ణి బయటికి పంపవచ్చు. చూడకపోతే గర్భగుడి మలినమవుతుంది.

స్వామి సన్నగా వణికి పోసాగాడు. తాను చూస్తూ చూస్తూ తప్పు చేసినట్లు దిగులు పడ్డాడు. ఎంత అపచారం తనవల్ల జరిగిందోనని వేదనపడుతున్నాడు.

ఇంతలో పక్కకు తప్పుకొన్న మూర్తి కనిపించాడు. స్వామి ముఖం వికసించింది. దేవుడి దర్శనమయిన భక్తుడు లాగా స్వామి పొంగిపోయాడు. ఆనందం ముఖంలో తాండవించింది. సంతోషంతో పరవసించిపోతూ 'ఉన్నావా' అన్నాడు. మూర్తి ఏమీ మాట్లాడలేదు.

స్వామికి మూర్తిమీద జాలికలిగింది. అంత సేపటి నుంచి ప్రవేశం కోసం ఆరాటపడుతున్న భక్తుడిమీద అభిమానం పొంగుకొచ్చింది.

ఉదయం నుంచి వివిఐపి కోసం నిరీక్షిస్తూ ఎండలో నిలబడిపోయిన స్వామి కార్యదీక్షపట్ల గౌరవం కలిగి మూర్తి ఆదరంగా చూశాడు. తాను ఎదురుచూస్తున్న మనిషి ఇంకా వచ్చినట్లు లేదు. పాపం! ఇంకా ఎంతసేపో-

'నీ బూట్లు విప్పి అక్కడ పెట్టు. నేను చూస్తుంటా. కౌంటరు ఏర్పాటు చేయించి, ఒక మనిషికి ఈ డ్యూటీ అప్పగించే పనిచూస్తాను. నీకు సంతోషమేనా?'

'సంతోషమే!-కానీ-'

'ఏం ఆగావు?'

'ఇప్పుడు లోపలికి వెళ్లిన ఆఫీసర్ల కాళ్ళకు బూట్లు చెప్పులు ఉన్నాయి. వాళ్ళను ఆపలేదేం?'

'నేను చూడలేదు.'

'ఆగు అంటే ఆగుతాను కాబట్టి నన్ను ఆపావు కాని వాళ్ళను ఆపలేదు. వాళ్ళు ఆగరు కాబట్టి ఆపలేదు. ఆగేవాడంటే అందరికీ అలుసే!'

'నిజంగా నేను చూడలేదు. చూస్తే చెప్పులు బూటులు వదిలి వెళ్ళేట్టు చేసేవాణ్ణి!'

'మీరు చూడకుండా లోనికి పోతే ఫరవాలేదా?'

'లోపల ఎవరు చూచినా బైటికి పంపుతారు?'

'వాళ్ళూ-మీలాగా-చూడకపోతే?'

'ఏమిటి నీ ఉద్దేశం?'

'చూడకూడదనుకొని చూడకపోతే ఏమీ కనిపించవు. ఎవరూ చూడకపోతే-'

'దైవదర్శనం చేసుకొని వస్తారు!'

'అప్పుడు అపచారం ఉండదా?'

'తప్పు చేస్తే అపచారం. బుద్ధిపూర్వకంగా తప్పుచేస్తే అపచారం. తెలియక జరిగితే అపచారం కాదు'

'అపచారం దేవుడు భరిస్తాడు'

'భగవంతుడు దయామయుడు క్షమిస్తాడు. మనమే దేవస్థానం మలిన పరచరాదు'

'దేవుడికి లేని అభ్యంతరం పూజారి కెందుకు?'

'దేవస్థానం పాతివ్రత్యం పూజారి బాధ్యత'

'దేవుడు నిమిత్తమాత్రుడా?'

'భక్తుడు తెలుసుకోవాలి'

'తెలుసుకోకపోతే?'

'తెలియ చెప్పాలి'

'వినకపోతే?'

'వినేట్టు, ఆచరించేట్టు చేయాలి'

'దేవుడికీ, భక్తుడికీ లేని పట్టింపు మధ్యలో పూజారికెందుకు?'

'అది ఆలయ ఆచారం. దాన్ని ప్రశ్నించరాదు.'

'అర్థంలేని ఆచారం కూడా ప్రశ్నింపరాదా?'

'అర్థం ఉందో లేదో చెప్పవలసింది పూజారి, భక్తుడుకాదు.'

'భక్తుడికీ, భగవంతుడికీ మధ్య మరొకరి ప్రమేయం అనవసరమేకదా?'

'అనవసరమే. ఎవరి ఇంటిలో వాళ్ళకది అనవసరమే! గుడిలోకాదు. గుడిలో పూజారి అనివార్యంగా అవసరమే.'

'భక్తుడి ఇంటి పూజకు, గుడిపూజకు తేడా ఉందా?'

'ఉంది. అవి వేరు వేరు. దేవాలయం మాది. దాని రక్షణభారం మాది. నా ప్రమేయం అనివార్యం.'

'దేవాలయం నాదికూడా?'

'ఆచారం ఉంటే, అపచారం లేకుండా ఉంటే దేవాలయం ఉమ్మడిసొత్తే. అపచారం భక్తుడు కలిగిస్తే దేవాలయ భాగస్వామ్యం రద్దవుతుంది.'

'ఎందరో మనుషులు ఎన్నో చర్మవ్యాధులు . అందరూ [illegible]ళ్ళో నడుస్తారు. ఏ ఏ వ్యాధి క్రిములు ఏ ఏ తావుల్లో అంటుకొంటున్నాయో? వాటి నుంచి తప్పించుకోవటం ఎట్లా? బూటుతో దేవాలయంలో ప్రవేశిస్తే బురదమాత్రమే, శుభ్రంగా లేకపోతే, ప్రవేశింపవచ్చు. నా బూటు

పరిశుభ్రంగా ఉంది. నీళ్ళతో కొడితే బురద పోతుంది. వ్యాధిక్రిములు కనిపించవు. చెప్పుల్లేని కాళ్ళతో వస్తే ఏ ఏ క్రియలు ఏఏ కాళ్ళకో అంటుకోవచ్చు. చర్మవ్యాధులు రావచ్చు. పెద్ద జబ్బులే రావచ్చు. పవిత్రంగా ఉంటుందనుకొనే దేవాలయం. రోగాలు పుట్టకావచ్చు. మేలుకోరి దైవ సన్నిధికి వస్తే కీడు మూడవచ్చు. అంత రోగంలో, రొచ్చులో, అశుభ్రంలో. అసహ్యంలో దైవదర్శనం అంటేనే ఒళ్ళు కంపరం పుడుతుంది. నన్ను నా బూటుతో పోనీయ్. రోగక్రిములు అంటుకొంటే బూటుకే అంటుతాయి. కడిగితే, తుడిస్తే, పాలీషు కొడితే పోతాయి. అవికాళ్ళకే అంటుకొంటే కడిగినా పోకపోవచ్చు. తడిచినా వదలకపోవచ్చు. శరీరం దేవుడిచ్చిన అద్భుతవరం. సర్వధర్మ నిర్వహణకు శరీరం మూలసాధనం. అది పాడయితే, రోగభూయిష్ఠమైతే సర్వధర్మాలు త్యజింపవలసి వస్తుంది. దైవదత్తమయిన శరీరాన్ని త్యజించలేము కాబట్టి దాని పావిత్ర్యం భద్రపరచాలి.

ఆత్మపరిశుభ్రంగా ఉండాలి. అయితే శరీరం వల్ల ఆత్మ మురికిది కారాదు. అన్ని మురుకులకు ఆలవాలమయి, నిలయమయి, సృష్టి స్థానమయిన శరీరం నవరంధ్రాలతో ఘోరమైన మురికి కేంద్రంగా ఉండగా, ఆ మురికిని తప్పించుకోవటానికి ముప్పతిప్పలు పడుతున్నా మనిషి కొత్త మురికి క్రిములతో సాన్నిహిత్యం పెంచుకొని, సాంగత్యం తెచ్చుకొని , శరీరం పాడయి, అందువల్ల ఆత్మనాశనమయి పోవటం వాంఛనీయం కాదు గదా? మురికి శరీరానికి రోత కోరికలు పుడతాయి. అవి తీరినా, తీరకపోయినా ఆత్మ మలిన మవుతుంది. అలా అవటం శరీరం ప్రధాన దోషి కావటంవల్లే. శరీరం దోషికాకుండా ఉండాలంటే అది మురికి కూపం కారాదు. అది మురికిలో పొరలరాదు. అది మురికి వాహికకారాదు. ఇన్ని వేల మంది గుడికి అంటించే రోగక్రిములవల్ల ఎన్ని వేలమంది అనారోగ్యానికి గురి అవుతున్నారో! పుణ్యం కోసం పోతే పాపం వచ్చినట్లు. నన్ను నేను కాపాడుకోవటం నా కనీస ధర్మం కదా! నన్ను మలినమంటరాదు. నేను అనాచ్ఛాదిత పాదంతో గుడిలోకి పోరాదు. అందువల్ల బూటుతో గుడిలోకి పోతాననటం!'

'గుడిలో మలినముండదు!'

'గుడిలో పరిశుభ్రత మాత్రమే ఉండదు'

'నువ్వన్న దాన్ని దేన్నీ నేను కాదనను. కానీ గుడిలోకి బూట్లతో పోరాదు. నీకు అనుమతి ఇచ్చి సభ్యసంప్రదాయం నాశనం చేయలేను'

స్వామి దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు.

'నువ్వు ఆకతాయివి కావని నాకు తెలుసు' నిట్టూర్పు విడిచారు. 'మొండిపిల్లవాడివి కావు' ఎగాదిగా చూశాడు. 'భక్తుడులాగా ఉన్నావు' భుజంతట్టి 'ధర్మం తప్పరాదుకదా!' అన్నాడు. ఇంకా చెప్పాడు.

'నీకేదో పట్టుదల ఉంది. నీది వేళాకోళం కాదని అనిపిస్తూ ఉంది. కానీ ఏం చేయను?

ధర్మానికి మనమంతా బందీలం! అయినా బూట్లు వేసుకొని గుడిలోకి పోవాలని నీకెందుకు పట్టుదల? నువ్వు చెప్పని ధర్మసూక్ష్మం ఏదో ఉంది.'

'నాకోసం చాలా ఆలోచిస్తున్నందుకు నాకు సంతోషంగా ఉంది. కాని మాటవరసకే అడుగుతున్నానుకోండి. నేను బూట్లు తీస్తే నడవలేను!'

'ఏం కష్టం?'

'రెండు కాళ్ళూ పచ్చిపుళ్ళు. రసికకారుతున్నాయి. కాలు నేలమీద మోపలేను!'

'ఏమయింది?'

'చర్మవ్యాధి. నయంకాని జబ్బు.'

'నాకున్న చర్మవ్యాధివల్ల, నేను బూట్లు లేకుండా నడవటం కష్టం. నాకేమో భక్తి ఉంది. నా కాళ్ళు సహకరించవు. నేను గుడిలోకి పోరాదంటే, నేను పూజించరాదని నిషేధించినట్లే!'

'నీకు భగవంతుడి అనుగ్రహం కలుగుతుంది. నీ చర్మవ్యాధి నయమవుతుంది.'

'నయంకాదనుకో-నేను దేవుణ్ణి దర్శించే భాగ్యం లేకుండా పోవాలా?'

'నయంకాని జబ్బులున్న వాళ్ళు గుడికి రాకూడదు.'

'జబ్బువల్ల భక్తి నిషిద్ధం కావాలా? శరీరం భౌతికం . భక్తి దైవికం. శరీరం ఐహికం. భక్తి ఆముష్మికం. ఐహికం అశాశ్వతం. ఆముష్మికం శాశ్వతం. అశాశ్వత ఐహికంవల్ల శాశ్వత ఆముష్మికం నిషిద్ధం అవుతుందా?'

'నిన్ను భగవంతుడే కాపాడాలి!'

'బూట్లు లేకుండా నేను గుడిలో నడిచినంత మేర రసిక కారుతూనే ఉంటుంది. నా వెనుక ఎందరో భక్తులు నడుస్తారు. ఇది అంటువ్యాధి. ఎందరికి అంటుకొంటుందో తెలియదు. ఎందరికి ఈ చర్మవ్యాధి వస్తుందో పీడిస్తుందో చెప్పలేం. ఇది మందులేని రోగం. నయంకాని జబ్బు, ఎందరు భక్తులు రోగులవుతారో! వాళ్ళు చర్మవ్యాధుల పీడితులు కారాదు. నా భక్తి, నా పూజ తప్పిపోరాదు. నలుగురికీ మేలు, నాకు సదవకాశం నేను బూట్లుతో గుడిలోకి రావటం.'

'అయ్యో!'

'నాకోసం నేను దేవుడికి దండం పెట్టుకోవాలి. జనంకోసం నేను బూట్లు లేకుండా నడవరాదు.'

'నా వరకు నాకు-'

'చెప్పండి!'

'ఈ పరిస్థితుల్లో బూట్లు వేసుకోనిచ్చి గుడిలోకి పంపాలని ఉంది. కాని గుడికట్టుబాట్లు, సంప్రదాయం, ఆచారం నన్ను కట్టిపడేస్తున్నాయి. నేను అశక్తుణ్ణి! నిస్సహాయుణ్ణి.'

ఆఫీసురుతో వచ్చిన ఉద్యోగులు వెళిపోయారు.

భక్తుల రాకపోకలు పెరిగాయి. సాయంత్రమయింది. అడవి నుంచి చల్లటి గాలి వస్తూ ఉంది. పొద్దుబాగా వాలిపోయింది.

పెద్ద పూజారి పోయి, ఒక వృద్ధ పూజారితో తిరిగి వచ్చాడు. వాళ్ళిద్దరూ మూర్తిని అనుమతించే విషయం చర్చించుకొన్నట్లు ఉన్నారు.

వృద్ధ పూజారి చెప్పాడు. 'నీ కాళ్ళతో పాటు నీ బూట్లు కడుక్కో. లోపలికి రా! లోపల కుళాయి ఉంది. మళ్ళీ బూట్లు కడుక్కో . దైవదర్శనం చేసుకో! నీ మొక్కు తీర్చుకో!'

'ఈ ఔదార్యానికి ధన్యవాదాలు. ఈ పెద్ద మనసు ఏర్పాటుకు ఎంతో ఋణపడి ఉన్నాను-కానీ' సందేహించాడు.

'ఏమిటి సందేహం?'

'ఈ ఔదార్యం నాకు గౌరవం కాదు. గర్వించలేను.'

'పూజించుకోవచ్చు!'

'రాలేను!'

'ఏమి?'

'సంప్రదాయం, ఆచారం, నియమనిష్ఠలను పాడుచేయలేను'

'ఈ అనుమతి సంతోషంగా ఇస్తున్నదే!'

'నాకు సంతోషం లేదు. ఒక సుప్రసిద్ధ సంప్రదాయం పక్కన పెట్టే హక్కు, అర్హత, అవకాశం దేవుడిగుడిలో ఏమానవమాత్రుడికీ లేవు. అసలు దైవ సేవకులైన పూజారులకూ లేవు. ఈ అనుమతి అపవాదమే కాని, నాకు మాత్రమేకాని, నా లాంటి అందరికీ ఇది అనుమతి కాదు. ఈ ప్రత్యామ్నాయమైన ఏర్పాటు నాకు పరాభవం.'

' ఆలోచించే అనుమతి అనుగ్రహించాం'

'ఈ ఔదార్యం మీ నియమనిష్ఠల్ని పరీక్షించటం నేను సహించలేను. మీ ఇద్దరి పట్ల నాకు గౌరవం ఉంది. ఈ అనుమతిపట్ల నాకు ఆవేదన ఉంది.'

' నీ ధర్మం నీది, మావృత్తి మాది!'

'పూజారితనం మీ ఇద్దరి కులవృత్తి. దాన్ని నేను అవమానించలేను. మీ కులవృత్తి మీకు గౌరవ ప్రదమే! ఎవరి కులవృత్తి వాళ్ళకు గౌరవ ప్రదమే! నా కులవృత్తి నాకూ ప్రాణప్రదమే! కులవృత్తులే లేవంటే అది విశేషమే! కులాలే లేవంటే అది అద్భుతమే. సాలెసోదరులు నేసిన బట్ట మీ శరీరం మీద దేవాలయమంతా తిరుగుతుంది. చాకలి అన్నలు ఉతికిన బట్టలు మీరు కట్టుకొని గుడిలో పుణ్యకార్యాలు చేస్తారు. మంగలి అగ్రజుడు వేసిన కత్తిరింపు, అద్భుతాలు

ఆలోచించే, మీ తల చుట్టూ ఉంటుంది. అగరుబత్తీలు చేసిన వాళ్ళు, అగ్గిపుల్లలు పెట్టెలు ఇచ్చినవాళ్ళు, పూలు పూయించిన వాళ్ళు, మాలలు కట్టిన కట్టినవాళ్ళు, టెంకాయలు కాయించిన రైతులు, అమ్మిన కోమట్లు, కొన్న సర్వవర్ణాలవాళ్ళు పూజలతో పూజారుల చేత గౌరవింపబడుతున్నారు. నాలుగు వర్ణాలవాళ్ళు, చిన్నాచితక, ముసలీ ముతక స్త్రీ పురుషులు సర్వదశలవాళ్ళు, సర్వ అవస్థలవాళ్ళు, సర్వరోగాలవాళ్ళు, సర్వపవిత్రాత్మలవాళ్ళు, ఊరూపేరూ చెప్పకుండా అవర్ణులు, పంచములు, దళితులు, సాయిబులు, కిరస్థానీలు, సిక్కులు, అందరూ హిందూ దేవుళ్ళను పూజింపవచ్చు. గుళ్ళలోకి కోతులు వస్తాయి. కుక్కలు వస్తాయి. సర్వపక్షులు క్రిమికీటకాలు జంతువులు అన్నీ గుడిలోకి రావచ్చు. కాని పంచముడు, దళితుడు కులంపేరు చెప్పి గుడికి రావటానికి లేదు. దేవుణ్ణి దర్శించుకోవటానికి లేదు. పూజచేయించటానికి లేదు. ఈ దౌర్భాగ్యం ఈ దేశంలోనే ఉంది. మన దేశంలో తప్ప దళితుణ్ణి మనిషిని మనిషి ఇంతగా పరాభవించటం ఎక్కడా లేదు. ఏ జాతిలోనూ లేదు. ఏ దేశంలోనూ లేదు.'

'నిన్ను మేం గుడిలోకి రమ్మంటున్నాంకదా!'

'దళితుడైనా రమ్మంటారా?'

'రమ్మన్నాంకదా!'

'తెలియక రమ్మన్నారు కానీ తెలిసి రమ్మనలేదు. నన్ను రమ్మనటం కాదు. అంటరాని వాళ్ళు అనబడేవాళ్ళందరినీ రానిస్తారా? రానీరు. అదీ మన సంప్రదాయం. మన ఆచారం. అవీ మన నియమ నిష్ఠలు.'

'మేం నిన్ను రానిస్తామన్నాంకదా!'

'రానివ్వటానికి మీరెవరు? రావటానికి నేనెవరు? రావటానికి నాకు యోగ్యత ఉంటే వద్దనటానికి, రమ్మనటానికి మీరెవరు? నాకు హక్కు ఉంటే నేను వస్తాను. లేదా మానతాను. నా యిష్టం. మీ ఇష్టంకాదు మీరు రమ్మంటే రావటానికి, మానమంటే మానటానికి. నేను బూట్లు తీసివస్తే నన్నెవరూ ఆపేవాళ్ళు కారు. బూటుతో రావద్దని అన్నమీరే రమ్మనటం మీకు గొప్పే! నాకు కాదు. నాకిది అవమానం. నా చెప్పుల్ని, బూటుల్ని, నా కులవృత్తిని అవమానించినచోట నేను ఆనందించలేను. అన్ని వృత్తులవాళ్ళు గౌరవింపబడేచోట నాకు సుఖశాంతులు లేకపోతే అవమానం ఉంది. అన్ని వృత్తుల మాదిరిగానే చెప్పులు కుట్టే వృత్తి కూడా శ్రమ విలువను ఎత్తిచూపేదే. అందరివృత్తులు మన్నన పొందినట్లే మాదిగ వృత్తి మన్నన పొందినప్పుడు నేను గుడిలోకి వస్తాను.

అందరూ గుళ్ళలోకి వచ్చినట్లుగానే, అందరి కులవృత్తి చిహ్నాలు గుడిలో ప్రవేశించగలిగినట్లు గానే చెప్పులతో అందరూ గుడిలోకి వచ్చేరోజు ఏదో ఒకనాడు రావచ్చు!

ఆరోజు కోసం నిరీక్షిస్తూ ఉంటాను. నా అన్నదమ్ములందరు మాదిగలందరు చెప్పులతో గుడికి రాగలిగే రోజు కోసం ఎదురుచూస్తూ ఉంటాను. ఆ రోజు గుడికి వస్తాను.'

'చెప్పులతో రావద్దంటే నీకేం నష్టం.'

'చెప్పులు కులవృత్తి చిహ్నాలు. చెప్పుల వెనక ఒక జాతి ఆత్మగౌరవం ఉంది. ఆర్తి ఉంది. ఆవేదన ఉంది. పూజారిని జంజెంతో గుడికి రావద్దంటే ఎంత అవమానమో ఈ మనిషిని చెప్పులతో రావద్దనటం అంతే అవమానం.'

'బూట్లుతోనే రావచ్చునన్నాంకదా!'

'నాకు భక్తి లేకపోతే నేను రాను. నా చర్మవ్యాధి భయం మిమ్మల్ని ఆలోచింపచేసింది. రసిక కారే పుళ్ళు నేను బూట్లు వేసుకొని దేవాలయంలోకి వచ్చే వీలు కల్పించాయి కాని, తోటి మానవుడి ఆర్తిని మీరు గుర్తించలేదు. కులవృత్తిని గౌరవించలేదు. అస్తిత్వాన్ని మన్నించలేదు. మీ భయం కారణంగా నాకు ప్రవేశం లభించకూడదు. మీ ప్రేమ, మానవ ప్రేమ, సోదర ప్రేమ నన్నూ, నా కులవృత్తిని మన్నిస్తే నేను ధన్యుణ్ణి. మేము సంతృప్తి పొందుతాము.'

మూర్తి కళ్ళవెంట ధారాపాతంగా నీరు కారుతూ ఉంది. మూర్తి ముందుకు వంగి బూట్లు లేసులు విప్పాడు, వదులుచేశాడు. బూట్లు తీసి సాక్స్ తీశాడు. కుళాయి దగ్గరకు పోయాడు. పేంట్ పైకిలాక్కుని కాళ్ళు కడుక్కొన్నాడు. కాళ్ళు నల్లగా ఉన్నా, పరిశుభ్రంగా ఉన్నాయి. ఏ చర్మ వ్యాధీ లేదు. కాళ్లమీద నిలచిన నీటి బొట్లు నీలాలు జల్లినట్లు మెరుస్తున్నాయి.

'ఇవి నా కాళ్ళు. వీటికి ఏ జబ్బులేదు. నేను గుడిలోకి పోవచ్చు. అర్హుడినేకదా!'

'అర్హుడివే!'

'బూట్లు వేసుకొని పోయి రావచ్చునా!'

'ఎటూ తీశావుకదా! ఇలాగ్గే పోయి రావచ్చు'

'నన్ను బూట్లతో గుడిలోకి పోయి రావచ్చునని అనుమతి ఇవ్వటం నా మీద ప్రేమతోకాదు, నా కాళ్ళజబ్బు భయంవల్ల!'

వాళ్ళేమీ మాట్లాడలేదు.

'మనం భయంతో బతకరాదు. ప్రేమతో జీవించాలి'

వంగి సాక్స్ వేసుకొని బూట్లు తొడుక్కున్నాడు.

'ఇంతకాలం దేవుడు నన్ను ద్వేషించలేదు. ప్రేమించాడు. చదువిచ్చాడు. ఉద్యోగమిచ్చాడు. సంసారమిచ్చాడు. సంతానమిచ్చాడు.'

బూట్లు సర్దుకొన్నాడు.

'మీ ఔదార్యానికి ధన్యవాదాలు. నా జాతి గౌరవ చిహ్నమయిన చెప్పులకు ప్రవేశ అర్హతలేని చోటికి నేను రాను. నన్ను రమ్మని మా చెప్పుల్ని వద్దంటే నేను భరించలేను. నా భక్తి

దేవుడికి, నా దక్షిణ గుడికీ కావలసివస్తే, నా కులవృత్తిని అవమానించరాదు. అవమానం లేనిరోజు నేను గుడికి వస్తాను.'

'పాదుకలు సింహాసనం మీద పెట్టి, భరతుడు రాజ్య పాలనం చేశాడు. భారతీయ సంస్కృతిలో చెప్పులకు ప్రత్యేక గౌరవం ఉంది.'

'వర్తమాన జీవితంలో వాటి ఉపయోగం వల్ల కూడా మన్ననలేదు.'

అయిదారు కారుల్లో చాలామంది ఉన్నతాధికారులు దిగారు. వాళ్ళను చూచి వి.వి.ఐ.పి. వచ్చాడని పెద్ద పూజారి. వృద్ధ పూజారి గబగబా వాళ్ళ దగ్గరకు వెళ్ళారు.

'వి.వి.ఐ.పి. మాకంటే ఐదు గంటల ముందే-అనుకొన్న సమయం కంటే ఐదు గంటలు ముందే-గుడికి వచ్చారని చెప్పారు. అందువల్ల మేం హడావుడిగా వచ్చాం. వారు ఒక్కరే వచ్చారు. దర్శనం అయిపోయిందా? వచ్చారా?'

'వారేనా?' పూజారులు మూర్తిని చూపించారు.

'వారే!' అధికారులంతా మూర్తి దగ్గరకు వచ్చారు.

'పూజారుల్ని దర్శించుకొన్నాను. నాలుగైదు గంటలు వారి దర్శనం సంభాషణం వీరు నాకు అనుగ్రహించారు. ధన్యుణ్ణి! ఇంత సమయం వీరు ఇంతకాలంలో ఏ ఒక్కరికీ కేటాయించి ఉండరు. ఆ విధంగా నేను చాలా అదష్టవంతుణ్ణి. మనం కలిసి వచ్చి ఉంటే వీళ్ళతో మనం మాట్లాడేవాళ్ళం కాదు. ఐదు నిమిషాలలో దైవదర్శనం పూర్తయి వెళ్ళిపోయి ఉండేవాళ్ళం. ఇప్పుడు అయిదు గంటల దైవ స్వరూపులు లాంటి పెద్ద పూజారులను దర్శించి, సంభాషించి తరించాను.'

'దయచేసి మీరంతా దైవదర్శనానికి రండి' పూజారులు వినయంగా ఆహ్వానించారు.

మూర్తి చెప్పాడు.

'మేమందరం మా చెప్పులు బూట్లతో దేవుడి పూజకు గుడిలోకి రావటం, మీకభ్యంతరం లేకపోతే, వస్తాం. కాదంటే వెళిపోతాం. మీ ఇష్టం.'